సాక్షి పశ్చిమగోదావరి


ఆదివారం । 2 । మార్చి । 2025



స్ట్రాంగ్ రూంల తనిఖీ

ఎమ్మెల్సీ ఎన్నికల బ్యాలెట్ బాక్సులు భద్రపరిచిన సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద భద్రత, నిఘా వ్యవస్థను శనివారం ఆర్వీ వెట్రిసెల్వి పరిశీలించారు.





పెద్దింట్లమ్మ జాతర ప్రారంభం

కొల్లేటికోట పెద్దింట్లమ్మ జాతర ప్రారంభమైంది. ఈ నెల 13 వరకు జాతర జరగనుండగా.. 10న జలదుర్గాగోకర్ణేశ్వర స్వామి కల్యాణం నిర్వహిస్తారు. 8లో ▸

న్యూస్‌రీల్

పోలవరం ప్రాజెక్టు పరిశీలన



పోలవరం ప్రాజెక్టు వద్ద వివరాలు తెలుసుకుంటున్న ట్రైనీ అటవీ అధికారులు

పోలవరం రూరల్: హైదరాబాద్‌లో అటవీ శాఖలో శిక్షణ పొందుతున్న అధికారులు శిక్షణలో భాగంగా పోలవరం ప్రాంతంలోని అటవీ ప్రాంతాన్ని, ప్రాజెక్టును శనివారం పరిశీలించారు. పోలవరం ప్రాజెక్టు తీరు, వివరాలు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

ఆర్వో, ఏఆర్వోలకు శిక్షణ

ఏలూరు(మెట్రో): ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు శనివారం కేంద్ర ఎన్నికల సంఘం ఆన్‌లైన్ శిక్షణ అందించింది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి మార్చి 3న ఓట్ల లెక్కింపు కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ విషయంపై ఎన్నికల సంఘం నిర్వహించిన ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి పాల్గొన్నారు.

జాతీయ సదస్సుకు మహదేవపట్నం సర్పంచ్



వనిమా సుబ్బలక్ష్మి

ఉండి: జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం ఢిల్లీలో నిర్వహించే వర్క్‌షాపునకు జిల్లా నుంచి ఉండి మండలం మహదేవపట్నం సర్పంచ్ వనిమా నాగ వెంకట సుబ్బలక్ష్మి ఎంపికయ్యారు. ఈ నెల 4, 5 తేదీల్లో నిర్వహించే ఈ సదస్సుకు ఆహ్వానించడం సంతోషంగా ఉందన్నారు. సాధికారితపై తన అభిప్రాయాలను ఢిల్లీ వేదికగా వినిపిస్తానన్నారు. రాష్ట్రం నుంచి ఈ కార్యక్రమానికి ఎంపికైన 12 మంది సర్పంచుల్లో తాను ఉన్నానని, ఈ గుర్తింపు లభించడం ఎంతో గౌరవంగా ఉందన్నారు. ఇదంతా మహదేవపట్నం ప్రజలు తనకు కల్పించిన కానుకని, వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు ఆమె తెలిపారు. 3న ఢిల్లీకి ప్రయాణమవుతున్నామని ఆమె తెలిపారు.

రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా క్రిమినల్ చట్టాలు

భీమవరం (ప్రకాశంచౌక్): ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ జిల్లా సమావేశం భీమవరం అంబేడ్కర్ భవనంలో శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఐఎల్ఏ రాష్ట్ర అధ్యక్షుడు జి.శాంతకుమార్ మాట్లాడుతూ నూతన క్రిమినల్ చట్టాలు రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా, రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టాలని చూస్తున్న అడ్వకేట్ అమెండ్‌మెంట్ యాక్ట్ న్యాయవాద హక్కులను కాలరాసేలా ఉందన్నారు. సమావేశంలో శీలం విజయ్‌కుమార్, ఇంజేటి జాన్ కెనడీ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారత వారోత్సవాలు

భీమవరం (ప్రకాశంచౌక్): మార్చి 8న జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో మహిళల భద్రత, రక్షణ కోసం మహిళా సాధికారత వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఎస్పీ అద్నాన్ నయీం అస్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో విద్యార్థినులు, మహిళలకు విధి నిర్వ హణలో పోలీసులు వినియోగించే పరికరాలు, ఆయుధాల ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. అనుభవజ్ఞులైన వైద్యుల పర్యవేక్షణలో మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందిస్తామన్నారు. విద్యార్థినులకు వ్యాస రచన పోటీలు, వక్తృత్వ, చిత్ర లేఖనం పోటీలు నిర్వహిస్తామన్నారు.

బ్లాక్‌లిస్టులో పని చేయని కాంట్రాక్టర్లు: కలెక్టర్

దెందులూరు: నిర్దేశించిన సమయంలోగా ఇరిగేషన్ కాలువలు, చెరువుల్లో గుర్రపు డెక్క, తూడు, పూడికతీత పనులు పూర్తి చేయని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో ఉంచాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. దెందులూరు మండలం సత్యనారాయణపురం, శింగవరం, గుండుగొలను తదితర ప్రాంతాలలోని ఇరిగేషన్ కాలువలు, చెరువులను శనివారం కలెక్టర్ పరిశీలించారు. నిధుల కొరత లేదని, గుర్రపు డెక్క, తూడు, పూడికతీత పనులు చేయని కారణంగా సాగు, తాగునీటి సమస్య తలెత్తిందన్న ఫిర్యాదు అందితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ ఎస్ఈ పీ నాగార్జునరావు, ఆర్డీఓ అచ్యుత్ అంబరీష్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ శాతంపై అనుమానాలు

- చివరి రెండు గంటల్లోనే 24.21 శాతం నమోదు
- ఉభయ గోదావరి జిల్లాల్లో 69.50 శాతం పోలింగ్
- 2007 నుంచి జరిగిన ఎన్నికల్లో ఇదే అత్యధికం
- టీడీపీ నేతలు దొంగ ఓట్లు వేయించారని ఆరోపణలు
- పీడీఎఫ్ ఏజెంట్లపై పలు చోట్ల దాడులు
- ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయనున్న పీడీఎఫ్

గత ఎన్నికల్లో పోలింగ్ ఇలా

2007లో 68 శాతం పోలింగ్ నమోదై జార్జి విక్టర్ ఎమ్మెల్సీగా గెలుపొందారు. 2013లో 1,04,946 ఓట్లు పోలవగా 53 శాతం పోలింగ్ నమోదైంది. మొదటి ప్రాధాన్యత ఓటు 52,851 ఓట్లు దక్కించుకున్న స్వతంత్ర అభ్యర్థి కర్రి రామకృష్ణారెడ్డి గెలుపొందారు. 2019లో 1,78,172 ఓట్లు పోలవగా 64.40 పోలింగ్ శాతం నమోదైంది. స్వతంత్ర అభ్యర్థి ఇళ్ళ వెంకటేశ్వరరావు (ఐవీ) 98,193 మొదటి ప్రాధాన్యత ఓట్లతో గెలుపొందారు.



ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు క్యూ లైన్‌లో నిల్చున్న ఓటర్లు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఉభయగోదావరి జిల్లాల్లో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో చివరి రెండు గంటల్లో అధిక శాతం పోలింగ్ నమోదుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మందకొడిగా ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నానికి కొంత పెరిగింది. చివరి రెండు గంటల్లో పోలింగ్ కేంద్రాల్లో భారీగా క్యూలైన్లు, వందల సంఖ్యలో ఓటర్లు బారులు తీరడం వంటివి లేకపోయినా.. పోలింగ్ మాత్రం 24.21 శాతం పెరగడంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పీడీఎఫ్ ఏజెంట్లు, నాయకులపై ప్రభుత్వ సహకారంతో టీడీపీ ఝులుం ప్రదర్శించి ఏకపక్షంగా ఎన్నిక జరిపించిందని పీడీఎఫ్ ఆరోపణలు గుప్పించింది. అధికార యంత్రాంగం దాడులు, దౌర్జన్యాలపై కనీసం స్పందించలేదు.

2007 నుంచి పరిశీలిస్తే ఈ సారి అత్యధిక పోలింగ్ నమోదు కావడం గమనార్హం. 2007లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్ హయాంలో శాసన మండలిని పునరుద్ధరించారు. 2007లో జరిగిన మొదటి ఎన్నికల్లో 68 శాతం, 2013లో 53 శాతం పోలింగ్ నమోదైంది. 2019లో 65.40 శాతం పోలింగ్ నమోదైంది. 2024లో మాత్రమే 69.50 శాతం పోలింగ్ నమోదైంది. సాధారణంగా పట్టభద్రుల ఎన్నికల్లో సగటున 50 నుంచి 65 శాతం లోపు మాత్రమే పోలింగ్ నమోదవుతూ వచ్చింది. గ్రాడ్యుయేట్ ఎన్నికలు కావడంతో ప్రజల్లో కూడా ఆసక్తి తక్కువగా ఉండటం, ఎన్నికల సంఘం విస్తృత స్థాయి ప్రచారం చేయకపోవడం ఇలా అనేక కారణాలు పోలింగ్ శాతాన్ని ప్రభావితం చేస్తాయి. ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులే 60 శాతానికి మించి పోలింగ్ జరగదని చెబుతుంటారు. ఈ సారి చివరి రెండు గంటల్లో 24.21 శాతం పోలింగ్ జరగడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు పోలింగ్ సమయంలో పీడీఎఫ్ ఏజెంట్లపై దాడులు చేసి చివరి రెండు గంటలు దొంగ ఓట్లు పోల్ చేశారని పీడీఎఫ్ ఆరోపించడంతో పాటు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయనుంది.

ఏజెంట్లపై దాడులు, బూత్‌ల వద్ద నగదు పంపిణీ

ఉమ్మడి జిల్లాలో ప్రతి పోలింగ్ బూత్ సమీపంలో పది మంది టీడీపీ నాయకులు ప్రత్యేకంగా క్యాంపులు ఏర్పాటు చేసి ఓటర్ల జాబితా, ఓటు వేయడానికి వెళ్తున్న వారి వివరాలు నమోదు చేశారు. జిల్లాలో కనీసం 40 శాతం కూడా పీడీఎఫ్ నాయకులు ఈ తరహా క్యాంపులు నిర్వహించలేదు. అదే విధంగా పోలింగ్ బూత్‌ల్లోనూ పూర్తి స్థాయిలో టీడీపీ ఏజెంట్లు ఉన్నారు. కొన్ని చోట్ల స్వతంత్ర అభ్యర్థుల ఏజెంట్లను కూడా టీడీపీ నేతలు వినియోగించుకున్నారు. పీడీఎఫ్ అభ్యర్థికి అన్ని చోట్ల ఏజెంట్లను ఏర్పాటు చేసినప్పటికీ అధికార పార్టీ హవాతో లింగపాలెం మండలం శింగగూడెం, పెదవేగి, జంగారెడ్డిగూడెంల్లో ఏజెంట్లపై దౌర్జన్యాలు చేసి బయటకు పంపడంపై అనుమానాలున్నాయి. లింగపాలెం మండలం యడవల్లిలో సీ.చిన్నారావు కుటుంబంతో కలిసి ఓటు వేయడానికి 278 పోలింగ్‌బూత్‌కు వస్తే అప్పటికే అతని ఓటు వేసేశారు.

ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లు

కలెక్టర్ వెట్రిసెల్వి



సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): గ్రాడ్యుయేట్ ఓట్ల లెక్కింపుపై పూర్తి అవగాహనతో లెక్కింపు చేయాలని తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వెట్రిసెల్వి సిబ్బందిని ఆదేశించారు. స్థానిక సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపుపై సిబ్బందికి శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కౌంటింగ్ 3న ఉదయం 8 గంటల నుంచి సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలోని కౌంటింగ్ కేంద్రంలో ప్రారంభవుతుందన్నారు. ముందుగా బ్యాలెట్ బాక్సులకు ఉన్న సీళ్లను పరిశీలించాలన్నారు. ఓట్ల లెక్కింపునకు 28 టేబుల్స్ ఏర్పాటు చేశామని, 17 రౌండ్లలో లెక్కింపు చేస్తారన్నారు. లెక్కింపు డెమోను సిబ్బందికి స్వయంగా చేసి చూపించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఇంటర్ పరీక్షలు



తాడేపల్లిగూడెం జీఎంఆర్ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

తాడేపల్లిగూడెం (టీఓసీ): జిల్లాలో ఇంటర్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శనివారం పట్టణంలోని శ్రీ వాసవి గ్రంధి మాణిక్యాలరావు జూనియర్ కళాశాలలోని పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ప్రతి క్లాస్ రూంకి వెళ్లి పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఎవరికైనా ఆరోగ్య సమస్య తలెత్తితే వెంటనే ఫస్ట్ ఎయిడ్‌కు సిద్ధంగా ఉండాలని వైద్య శాఖ సిబ్బందికి సూచించారు. ఇంటర్ మొదటి సంవత్సరం 19,708 మంది, రెండో సంవత్సరం 18,123 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని వెల్లడించారు. ప్రశ్నాపత్రాలు భద్రపరిచేందుకు జిల్లాలో 13 స్టోరేజ్ పాయింట్లు, మూడు ఫ్లైయింగ్ స్క్వాడ్లు, మూడు సిట్టింగ్ స్క్వాడ్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పరీక్షల నిర్వహణలో సమస్యలు వస్తే కంట్రోల్ రూమ్ నెంబర్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రశాంత వాతావరణంలో ఇంటర్ పరీక్షలను పూర్తి చేయడానికి అధికారులు కృషి చేయాలని తెలిపారు.

పది పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): పదో తరగతి పరీక్షలు సజావుగా జరిగేలా పక్కా ప్రణాళికలు రూపొందించుకుని మంచి ఫలితాలు సాధించాలని కలెక్టరు చదలవాడ నాగరాణి తెలిపారు. శనివారం స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగు కాలేజీలో ఏర్పాటు చేసిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణ శిక్షణ తరగతుల్లో ముఖ్య అతిథిగా కలెక్టరు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో 128 కేంద్రాల్లో 24,393 మంది విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. ఎలాంటి చిన్న సమస్య వచ్చినా ఉన్నతాధికారులు దృష్టికి తీసుకొచ్చి సమస్య పరిశీలించుకోవాలన్నారు. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని, రక్షిత తాగునీరు అందించాలన్నారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే పార్శిళ్లలో దళారుల రాజ్యం

- వాహనానికి రూ.600 నుంచి రూ.వెయ్యి వరకు అదనంగా వసూలు
- అధికారులకూ వాటా ఇస్తున్నామంటున్న దళారులు



తణుకు రైల్వే స్టేషన్



తణుకు రైల్వే స్టేషన్‌లో ఇచ్చిన రసీదు

తణుకు అర్బన్: తణుకు రైల్వే స్టేషన్ పార్శిళ్ల రవాణాలో దళారుల దోపిడీ రాజ్యం నడుస్తోంది. పార్శిళ్లకు దళారులు చార్జీల మోత మోగిస్తున్నారు. ముఖ్యంగా రైళ్లలో ద్విచక్ర వాహనాల రవాణా చేసేందుకు భారీగా దోచుకుంటున్నారు. తణుకు రైల్వే స్టేషన్ నుంచి నిత్యం హైదరాబాద్, బెంగళూరు, విశాఖపట్నం తదితర దూరప్రాంతాలకు ద్విచక్ర వాహనాలు పార్శిళ్ల రూపంలో రైళ్లలో వెళ్తుంటాయి. ఇందు కోసం ముందుగా రైల్వే కౌంటర్‌లో దరఖాస్తు రాసి రుసుం చెల్లించాలి. ఇంతవరకూ బాగానే ఉన్నా పార్శిల్ విభాగంలో ఉన్న దళారులు వాహనం ప్యాకింగ్, ఇతర ఖర్చులంటూ డబ్బులు గుంజేస్తున్నారు.

ఇటీవల బెంగళూరుకు వాహనం పంపించేందుకు పట్టణానికి చెందిన వ్యక్తి రైల్వే కౌంటర్‌లో రూ.1850 కట్టాడు. పార్శిల్ చేసే క్రమంలో దళారులకు మరో రూ.వెయ్యి కట్టాల్సి వచ్చింది. హైదరాబాద్‌కు వాహనం పంపించేందుకు మరో వ్యక్తి రైల్వే కౌంటర్‌లో రూ.935 చెల్లించి, పార్శిళ్ల విభాగంలో రూ.600 కట్టాడు. రైల్వే ట్రాన్స్‌పోర్టు తక్కువవుతుందని వస్తున్నామని, ఇక్కడ కూడా ప్రైవేటు ట్రాన్స్‌పోర్టులో తీసుకున్నట్లే దోచుకుంటున్నారని వాహనదారులు వాపోతున్నారు. తత్కాల్ టికెట్ల వ్యవహారంలో కూడా దళారులు కీలకపాత్ర పోషిస్తున్నారని, అధికారులకు కూడా వాటాలు ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఉద్యోగులకు వాటా ఇస్తున్నాం : తాము తీసుకునే మొత్తంలో రైల్వే గార్డు నుంచి పైస్థాయి అధికారుల వరకు ఇవ్వాలని దళారులు చెబుతున్నారు. ప్రతి వాహనంలో వసూలు చేసే మొత్తంలో రైల్వే వర్గాలకు ఇచ్చిన తరువాత మిగిలింది తాము తీసుకుంటామని చెబుతున్నారు. ఈ విషయంపై తణుకు రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ నాగరాజును సాక్షి వివరణ కోరగా వాహనాల పార్శిళ్లకు సంబంధించి రుసుం వసూలు చేస్తున్న విషయం తమ దృష్టికి రాలేదని విచారణ చేయిస్తానని చెప్పారు.

రూ.1000 వసూలు చేశారు

బెంగళూరులో ఉంటున్న మా అబ్బాయికి గత నెల 12న ద్విచక్ర వాహనాన్ని తణుకు రైల్వే స్టేషన్ ద్వారా పంపించాను. రైల్వే బుకింగ్‌లో రూ.1850 కట్టించుకోగా పార్శిల్ విభాగంలో రూ.వెయ్యి కట్టించుకున్నారు. రైల్వే టికెట్‌కు కూడా అదనంగా రైల్వే కౌంటర్‌లోనే డబ్బులు కట్టాను. అడుగుదామంటే కొత్త బండి ఏ రకంగా పంపిస్తారో, ఏమైనా డ్యామేజ్ చేస్తారేమోనని వారు అడిగిన మొత్తం ఇచ్చేశాను. ప్రభుత్వ విభాగాల్లో కూడా దళారుల రూపంలో డబ్బులు దోచేస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారో తెలియడంలేదు.

-కె.రాము, తణుకు

కూటమి బడ్జెట్‌తో విద్యా రంగం కుదేలు



గెడ్డం సుధీర్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో విద్యారంగం కుదేలైందని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గెడ్డం సుధీర్ ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. ఈ బడ్జెట్‌లో కేటాయించిన నిధులు విద్యారంగ అభివృద్ధికి అరకొరగా మాత్రమే పనికొస్తాయన్నారు. గత ప్రభుత్వం పాఠశాలల కోసం నాడు – నేడు పేరుతో కోట్లాది రూపాయలు వెచ్చించిందని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో పాఠశాలల అభివృద్ధి ఊసెత్తలేదన్నారు. ఉన్నత విద్యకు సంబంధించి ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై కూడా ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదన్నారు. ఉపాధ్యాయులను ఈ బడ్జెట్ తీవ్ర నిరాశకు గురి చేసిందన్నారు. పీఆర్‌సీ గురించి ప్రకటన చేయకపోవడం దారుణమని, గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కనీసం మధ్యంతర భృతి అయినా ప్రకటించిందని, ఈ ప్రభుత్వం మధ్యంతర భృతి కూడా ప్రకటించకుండా ఉపాధ్యాయులను దారుణంగా మోసం చేసిందన్నారు.

బడ్జెట్‌లో కౌలు రైతులకు అన్యాయం

మామిడిశెట్టి రామాంజనేయులు, కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

భీమవరం (ప్రకాశంచౌక్): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆహార ధాన్యాలు పండిస్తున్న కౌలు రైతులను పూర్తిగా విస్మరించారని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా కమిటీ విమర్శించింది. ఈ సందర్భంగా కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు మాట్లాడుతూ కౌలు రైతుల సంక్షేమం కోసం ప్రత్యేక కేటాయింపులేవీ చేయకుండా వ్యవసాయంలో వృద్ధి సాధించడం ఎలా సాధ్యమన్నారు. కొత్త కౌలు చట్టాన్ని ఎప్పుడు అమలు చేస్తారో స్పష్టంగా చెప్పలేదన్నారు. కౌలు రైతులకు ప్రత్యేకంగా బ్యాంకు రుణాల కేటాయింపు లేదన్నారు. పంటల బీమాకు కేవలం రూ.1,023 కోట్లు కేటాయించిన ప్రభుత్వం పంట నష్టం, విపత్తుల నిధి వంటివి పట్టించుకోలేదన్నారు. జిల్లాలో కాలువల ఆధునీకీకరణకు అధికారులు సుమారు రూ.50 కోట్ల వరకు ప్రతిపాదనలు పంపారని, బడ్జెట్‌లో డెల్టా ఆధునికీకరణకు కేవలం రూ.11 కోట్లు కేటాయించారని తెలిపారు. తక్షణం కాలువల ఆధునికీకరణకు రూ.100 కోట్లు, కౌలు రైతుల పంట రుణాలకు రూ.500 కోట్లు కేటాయించాలన్నారు.

గురుకులం.. పేద విద్యార్థులకు వరం

దరఖాస్తులకు ఈ నెల 6 వరకు గడువు



పోలసానిపల్లిలోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల కళాశాల

భీమడోలు: 2025–26 విద్యా సంవత్సరానికి బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో చేరేందుకు గురుకులాల సొసైటీ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఈ నెల 6 లోగా దరఖాస్తు చేసుకోవచ్చు. గురుకులాల్లో శారీరక, మానసిక ఉల్లాసం కోసం క్రీడలు, యోగా, ధ్యానం వంటి వాటిలో శిక్షణ అందిస్తారు. విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, యూనిఫాం ఇస్తారు. ఉపాధ్యాయులు నిరంతర పర్యవేక్షణలో నాణ్యమైన విద్యా బోధన అందిస్తారు. అన్ని రకాల పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తారు. ఐదో తరగతిలో చేరికకు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2012 సెప్టెంబర్ 1 నుంచి 2016 ఆగస్టు 31 మధ్య జన్మించాలి. ఓసీ, బీసీ విద్యార్థులు 2014 సెప్టెంబర్ 1 నుంచి 2016 ఆగస్టు 31 మధ్య పుట్టి ఉండాలి. జూనియర్ ఇంటర్‌లో చేరికకు 2024–25 ఏడాదిలో పదో తరగతి పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు అర్హులు. ఐదో తరగతి, ఇంటర్ ప్రవేశాలకు విద్యార్థి తల్లిదండ్రులకు ఏడాది ఆదాయం రూ.లక్షకు మించరాదు. ఒక్కో పాఠశాలలో ఐదో తరగతికి 80 సీట్లు, జూనియర్ ఇంటర్‌కు 80 సీట్లు ఉంటాయి.

దరఖాస్తుకు ఇవి తప్పనిసరి : విద్యార్థి వివరాలు తప్పులు లేకుండా నమోదు చేసుకోవాలి. నమోదు సమయంలో విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి ఆధార్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఫొటోలు, తెల్లరేషన్ కార్డు, పూర్వ తరగతికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు ఉండాలి. ఐదో తరగతి ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 6న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తారు. ఇంటర్ ప్రవేశానికి అదే రోజు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరుగుతుంది.

పాఠశాలలు ఎక్కడెక్కడ ఉన్నాయి

- ఏలూరు జిల్లాలో బాలురకు పెదవేగి, చింతలపూడి, బాలికలకు పోలసానిపల్లి, వట్లూరు, ద్వారకాతిరుమల, జంగారెడ్డిగూడెం, నూజివీడులో పాఠశాలలున్నాయి.
- పశ్చిమగోదావరి జిల్లాలో బాలురకు ఆరుగొలను, న్యూ ఆరుగొలను, ఎల్‌బీ చర్ల(నరసాపురం), బాలికలకు పెనుగొండలో పాఠశాల ఉంది.

ప్రతిభ ఆధారంగా సీట్లు



ఏటా ఐదో తరగతి, జూనియర్ ఇంటర్‌లో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాం. బయట దరఖాస్తు చేయించుకుంటే డబ్బులు చెల్లించాలి. మీ సమీపంలోని ఎస్సీ గురుకుల పాఠశాలల్లో ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చు. ఐదో తరగతి ప్రవేశ పరీక్షకు నాలుగో తరగతి సిలబస్ వరకు చదువుకోవాలి. ఇంటర్ వారికి పదో తరగతి వరకు సిలబస్ చదవాలి.

– బి.ఉమాకుమారి, డీసీవో, ఏలూరు

కళాశాలలు ఎక్కడెక్కడ ఉన్నాయి

- ఏలూరు జిల్లాలో బాలురకు పెదవేగిలో, బాలికలకు పోలసానిపల్లి, వట్లూరు, ద్వారకాతిరుమల, జంగారెడ్డిగూడెం, నూజివీడులో కళాశాలలున్నాయి ఉన్నాయి.
- పశ్చిమగోదావరి జిల్లాలో బాలురకు ఆరుగొలను, ఎల్‌బీ చర్ల(నరసాపురం)లో కళాశాలలున్నాయి. జంగారెడ్డిగూడెం మినహా ఇతర కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీకి 40 సీట్ల చొప్పున 80 సీట్లు ఉన్నాయి. జంగారెడ్డిగూడెం బాలికల కళాశాలలో ఎంఈసీ, సీఈసీ గ్రూపులు ఉన్నాయి. ద్వారకాతిరుమల బాలికల కళాశాలలో ఈ ఏడాది నుంచి జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్, నీట్ పరీక్షకు తగిన శిక్షణ ఇస్తారు.

పాడి పశువులకు టీకాలు వేయించాలి



నవాబుపాలెంలో గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

తాడేపల్లిగూడెం రూరల్: జిల్లాలోని పశు పోషకులందరూ తమ పాడి పశువులకు టీకాలు వేయించాలని కలెక్టర్ సూచించారు. నవాబుపాలెంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం కింద టీకాల కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 30 వరకు గాలికుంటు నిరోధక టీకాల పంపిణీ జరుగుతుందన్నారు. మూడో విడతగా 9,300 పెయ్యి దూడలకు బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాలను వేస్తారన్నారు. ఆర్డీవో కాసర్ బానో, పశుసంవర్ధక అధికారి మురళీ కృష్ణ, తాడేపల్లిగూడెం డీడీ డాక్టర్ ఎల్‌కే సుధాకర్, ఏడీ డాక్టర్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు అందజేసిన కలెక్టరు

జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో 2,26,044 మందికి రూ.96.61 కోట్ల నగదును పింఛన్లుగా పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్ సి.నాగరాణి తెలిపారు. శనివారం మండలంలోని నవాబుపాలెంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. పంపిణీని వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

ప్రయోగాత్మకంగా రీ-సర్వే

తాడేపల్లిగూడెం రూరల్: భూములకు కచ్చితమైన హద్దులు గుర్తించేలా ప్రయోగాత్మకంగా రీ-సర్వే జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. తాడేపల్లిగూడెంలో నవాబుపాలెంలో రీ–సర్వే గ్రౌండ్ ట్రూతినింగ్ పనులను, సరిహద్దుల మ్యాప్‌లను శనివారంఆమె పరిశీలించారు. రైతులు భూములకు ఖచ్చితమైన హద్దులు గుర్తించి ప్రయోగాత్మకంగా రీ–సర్వే నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. సర్వే నిర్వహించే ముందు భూ యజమానులకు సమాచారం అందించాలన్నారు. వారి సమక్షంలోనే సర్వే నిర్వహించాలని సూచించారు. రైతులు అభ్యంతరాలను ప్రామాణికంగా తీసుకొని వాటిని నివృత్తి చేయాలన్నారు. దస్తావేజులు తప్పులుంటే సరి చేయాలన్నారు. అనంతరం గ్రామంలోని ప్రభుత్వ లేఅవుట్ కాలనీ లబ్ధిదారులతో మాట్లాడారు. దశలవారీగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. మంచినీటి సదుపాయానికి ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇంటి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గర్భవతులు, చిన్నారుల్లో రక్తహీనత లేకుండా చూడాలన్నారు. వివిధ రకాల క్యాన్సర్లు గుర్తించడానికి చేస్తున్న సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

క్లుప్తంగా

ముగిసిన చెడుగుడు పోటీలు



విజేతలకు నగదు బహుమతి అందిస్తున్న దృశ్యం

వీరవాసరం : రాయకుదురు శివారు జగన్నాథ్ రావుపురంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీలు ముగిశాయి. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీల్లో వీర్ల వెంకమ్మ యూత్ చీరాల టీం విజేతగా నిలిచి రూ.25 వేల నగదు బహుమతిని అందుకున్నట్లు మ్యాచ్ రిఫరీ గంగా మహేష్ శనివారం తెలిపారు. రెండో స్థానంలో బేతపూడి టీం, మూడో స్థానంలో బల్లిపాడు గరువు టీం, నాలుగో స్థానంలో శ్రీకాంత్ ఫ్రెండ్స్ చిత్తూరు, ఐదో స్థానంలో శ్రీను ఫ్రెండ్స్ నెల్లూరు టీం, ఆరో స్థానంలో మస్తానయ్య మెమోరియల్ టీం నిలిచాయి. వీరందరికీ నగదు బహుమతులు అందజేశారు. అత్యుత్తమ క్రీడా ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు బెస్ట్ డిఫెన్స్, బెస్ట్ ప్లేయర్ అవార్డులను అంజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భక్తుల రద్దీ నామమాత్రం



శ్రీవారి క్షేత్రంలో నామమాత్రంగా ఉన్న భక్తులు

ద్వారకాతిరుమల : చినవెంకన్న క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ బాగా తగ్గింది. శ్రీవారికి ప్రీతికరమైనరోజు కావడంతో ప్రతి వారం వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించేవారు. అయితే ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రారంభం కావడంతో ఈ వారం క్షేత్రానికి నామమాత్రంగా భక్తులు విచ్చేశారు. దాంతో ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతం, అనివేటి మండపం, వైకుంఠం క్యూకాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల ఇతర విభాగాల్లో భక్తుల సంఖ్య స్వల్పంగా కనిపించారు.

7న ఎలక్ట్రీషియన్, ఫిట్టర్‌లకు అప్రెంటీస్ మేళా

ఉండి: ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ ట్రేడుల్లో ఐటీఐ పూర్తిచేసిన అభ్యర్థులకు తణుకులోని ఆంధ్రా షుగర్స్ క్యాంపస్ నందు ఈ నెల 7వ తేదీ ఉదయం 10 గంటల నుంచి అప్రెంటీస్ మేళా నిర్వహించనున్నట్లు ఐటీఐ జిల్లా కన్వీనర్ వీ శ్రీనివాసరాజు తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు సర్టిఫికెట్లతో నేరుగా హాజరుకాలవాన్నారు. వివరాలకు ఎన్నార్పీ అగ్రహారంలోని ఐటీఐ ప్రధానాధికారిని గానీ జూనియర్ అప్రెంటీస్ అడ్వైయిజర్‌ను 96760 99988, 88863 39666 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ధార్మిక చింతనకు ప్రతీక.. రంజాన్

- నేటి నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం
- ప్రత్యేక ప్రార్థనలు, ధార్మిక చింతనలో ముస్లింలు

చింతలపూడి: ముస్లింలకు అతి పవిత్రమైన రంజాన్ నెల ఉపవాసాలు ఆదివారం నుంచి ప్రారంభం అవుతున్నాయి. శనివారం నెల వంక దర్శనంతో రంజాన్ మాసం ప్రారంభమవుతుంది. పవిత్ర ఖురాన్ అవతరించిన మాసంగా ముస్లింలు విశ్వసించే ఈ నెలంతా ఉపవాసాలు, ప్రత్యేక ప్రార్థనలు, దాన ధర్మాలతో గడుపుతారు. రోజూ మొత్తం అరాధనలోనే ఎక్కువ సమయం గడుపుతారు. ఖురాన్ ప్రకారం రంజాన్ నెలలో విధిగా ఉపవాస వ్రతాన్ని పాటిస్తారు. రంజాన్ నెల ముస్లిం విశ్వాసుల పండుగ. అభిమానానికి, స్నేహానికి ప్రతీకగా దీనిని ఆచరిస్తారు. రంజాన్ నెలలో ముస్లింలు క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనతో అల్లాహ్‌ను ప్రార్థిస్తారు. జిల్లాలోని ఏలూరు, జంగారెడ్డిగూడెం, చింతలపూడి, నూజివీడు, కైకలూరు, పట్టణాల్లో రంజాన్ పండుగను ముస్లింలు ఏటా ఘనంగా జరుపుకుంటారు.

నిష్టతో ఉపవాసాలు

రంజాన్ మాసం ప్రారంభమైన నాటినుంచి ముగిసేవరకు ముస్లింలు పగలు నిష్టగా (రోజా) ఉపవాస దీక్షలను పాటిస్తారు. కేవలం ఆహార పానీయాలను మానేయడం మాత్రమే కాకుండా నియమాలతో కూడుకున్న జీవన విధానాన్ని ఆచరిస్తారు.



రంజాన్ ఉపవాసాల కోసం ముస్తాబయిన చింతలపూడి జామియా మసీదు

తెల్లవారుజామున ఆహారం తీసుకోవడాన్ని సహర్ అని, సాయంత్రం ఉపవాస దీక్ష విరమణలో తీసుకునే ఆహారాన్ని ఇఫ్తార్ అని అంటారు. ఇలా ప్రతి రోజు సుమారు 13 గంటలపాటు కఠిన ఉపవాస దీక్షను అవలంభిస్తారు. ఒకవేళ ఏదైనా అనారోగ్యంతో ఉపవాసం ఉండలేకపోతే అలాంటి వారు రంజాన్ తర్వాత వాటిని పూర్తి చేయాల్సి ఉంటుంది.

షబ్–ఎ–ఖద్ర్

రంజాన్ నెల ప్రారంభమైన 27వ రోజు షబ్–ఎ–ఖద్ర్ ను ముస్లింలు జరుపుకుంటారు. ఈ రోజున దివ్య ఖురాన్ అవతరించిందని ముస్లింల విశ్వాసం . ఈ రోజున రాత్రంతా జాగరణ చేసి ప్రార్ధనలతో గడుపుతారు. ఆ రాత్రి భక్తి శ్రద్ధలతో ప్రార్థనలు చేసిన వారికి ఎన్నో సంవత్సరాల పాటు ప్రార్థనలు చేస్తే వచ్చే పుణ్యం దక్కుతుందని విశ్వాసం.

జకాత్

ముస్లింలకు నమాజ్, రోజా ప్రకారమే జకాత్ కూడా నిర్ణయింపబడింది. దైవం కోసం, దైవ ప్రసన్నత పొందడానికి ఒక బాధ్యతగా సంపదలో కొంత మొత్తాన్ని పేదలకు అందించడమే జకాత్ ముఖ్య ఉద్దేశం. రంజాన్ నెలలోనే ముస్లింలు విధిగా జకాత్ చెల్లిస్తారు. పేద, ధనిక అంతరాలను రూపు మాపడానికి జకాత్ తోడ్పడుతుందని నమ్ముతారు. జకాత్ అంటే పరిశుద్ధ పరిచేది అని అర్థం

ఫిత్రా

రంజాన్ నెల అంతా నమాజులు, ఉపవాసాలు, జకాత్ చెల్లించడంతో పాటు నెల ముగిసి పండుగ జరుపుకునే ముందు ఫిత్రా అంటే దానం. పేదలు కూడా పండుగ రోజు సంతోషంగా పాల్గొనాలని చేసిన ఏర్పాటు ఇది. కుటుంబంలో ఎంత మంది సభ్యులు ఉంటే అందరి తరుపున విధిగా ఫిత్రా చెల్లిస్తారు. ఒక్కో ఫిత్రా కింద రెండున్నర కిలోల ఆహార ధాన్యాలు, లేదా అందుకు సమానమైన నగదు చెల్లించాలి.

పది రోజులకో ప్రత్యేకత

30 రోజుల ఉపవాస దినాల్లో ప్రతి 10 రోజులకు ఓ ప్రత్యేకత ఉంది. మొదటి 10 రోజులు కారుణ్య దినాలుగా భావిస్తారు. అల్లాహ్ కారుణ్యం కోసం ఈ పది రోజులు ఉపవాసం ఉంటారు. 11 నుంచి 20వ రోజు వరకు క్షమాభిక్ష దినాలుగా పరిగణిస్తారు. తమ పాపాలను క్షమించమని అల్లాహ్‌ను వేడుకుంటూ ఉపవాసాలు ఉంటారు. చివరి పదిరోజులు నరకాగ్ని నుంచి కాపాడమని దువాలు చేస్తూ ఉపవాసాలు పాటిస్తారు.

హలీం

ప్రతిదినం ఇఫ్తార్ సమయంలో సేవించే హలీద(జావ)కు కొన్ని ప్రత్యేకతలు ఉంటాయి. మసాలా దినుసులతో పాటు ప్రత్యేక ఆహార పదార్థాలతో దీన్ని తయారు చేస్తారు. బొంబాయి రవ్వ, బియ్యం రవ్వ, మేక మాంసం తదితర పదార్థాలను కలిపి జావ తయారు చేస్తారు. దీనిని మట్టి పాత్రలలో సేవిస్తారు.

దైవ భీతిని కలుగజేస్తుంది



ఉపవాసం మనిషిలో దైవ భీతిని కలుగజేస్తుంది. అల్లాహ్‌కు వినమ్రంగా మారుస్తుంది. ఉపవాసం ఉండే మనిషికి మనసు మీద నియంత్రణ సులువు అవుతుంది. ఆరోగ్యంతో పాటు ఇతరుల పట్ల సోదర భావం పెరుగుతుంది. ఆకలితో ఉన్నవారు, అవసరాలతో ఉన్న వారి పట్ల దయా గుణం పెరుగుతుంది. త్యాగ నిరతిని పెంపొందించే ఉపవాస దీక్షలు ప్రతి ముస్లిం విధిగా చేయాలి.

– మహమ్మద్ అబ్దుల్ వదూద్, జామియ మస్జిద్ ఇమామ్

దయాగుణం పెరుగుతుంది



రంజాన్ ఉపవాసాల వల్ల పాపాలు తుడిచి పెడ్తాయి. ఆరోగ్యంతో పాటు ఇతరుల పట్ల సోదర భావం పెరుగుతుంది. ఆకలితో ఉన్న వారు, అవసరాలతో ఉన్న వారి పట్ల దయాగుణం పెరుగుతుంది. నెల రోజుల ఉపవాసాల వల్ల పుణ్యాం కలుగుతుంది.

– సయ్యద్ రహీం (బాబు), జామియ మస్జిద్ కమిటీ అధ్యక్షుడు

షవ్వాల్

ఉపవాస దీక్షలు నెలఅంతా కొనసాగిన అనంతరం నెలవంక ప్రత్యక్షమవగానే ఉపవాస దీక్షలను విరమిస్తారు. దీనినే షవ్వాల్ అంటారు. మరుసటి రోజున పండుగను అత్యంత భక్తి శ్రద్ధలతో సంతోషాలతో జరుపుకుంటారు. ఉపవాస దీక్షలకు మసీదులను సిద్ధం చేస్తున్నారు.

పెద్దింట్లమ్మ జాతర ప్రారంభం



కైకలూరు పెద్దింట్లమ్మను దర్శించుకున్న భక్తులు

- అమ్మవారికి శ్రీచక్రార్చన, పంచహారతులు
- ఈ నెల 13 వరకు జాతర

కైకలూరు : రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన కొల్లేటికోట పెద్దింట్లమ్మ జాతర శనివారం ప్రారంభమయ్యింది. ఉదయం విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచన, పుష్పాలంకరణ, నూతన వస్త్రాలంకరణ, పంచామృతాభిషేకం, పంచహారతలు జరిగాయి. అమ్మవారికి మొదటి రోజు వస్త్ర, పుష్పాలంకరణ, ఉచిత ప్రసాద దాతలుగా భుజబలపట్నంకు చెందిన ముదునూరి రామలింగరాజు, కనుమూరి నాగ వెంకట సుబ్బరాజు, పేరిచర్ల హేమంత్ వర్మ దంపతులు వ్యహరించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఏలూరు సప్పా భారతి కళాకారిణి ప్రదర్శించిన పార్వతీ కల్యాణం హరికథా కాలక్షేపం ఆకట్టుకుంది. ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాసు మాట్లాడుతూ జాతర ఈ నెల 13 వరకు జరుగుతుందన్నారు. భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. జాతరలో ప్రధాన ఘట్టమైన జలదుర్గాగోకర్ణేశ్వరస్వామి కల్యాణం ఈ నెల 10న జరుగుతుందన్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు పేటేటి పరమేశ్వరశర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

పటిష్ట బందోబస్తు

అమ్మవారి జాతరలో పటిష్ట పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసినట్లు రూరల్ సర్కిల్ సీఐ వి.రవికుమార్ చెప్పారు. రూరల్ ఎస్సై వి.రాంబాబుతో కలసి దేవస్థాన ఆవరణలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ దేవస్థానం వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. జాతర జరిగే ప్రతి ఆదివారం భక్తుల తాకిడి అధికంగా ఉంటుందని, అందుకు తగ్గట్టుగా పోలీసు సిబ్బందిని నియమించామన్నారు.

రాజబాబు మృతి పార్టీకి తీరని లోటు





సంతాప సభలో రాజబాబుకు నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు, మాజీ రాజ్యసభ సభ్యుడు కేవీపీ, విశాఖపట్నం స్మార్ట్ సిటీ మాజీ చైర్మన్ జీవీ

ద్వారకాతిరుమల: చివరి నిమిషం వరకు పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబును పార్టీ శ్రేణులు ఆదర్శంగా తీసుకోవాలని ఆ పార్టీ మాజీ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. ద్వారకాతిరుమల మండలం సీహెచ్ పోతేపల్లిలో శనివారం నిర్వహించిన రాజబాబు సంతాప సభలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు. రాష్ట్ర మాజీ హోం మంత్రి తానేటి వనిత, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ, మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు, రాజ్యసభ మాజీ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు, ఏలూరు మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్, పార్టీ కొవ్వూరు, ఉంగుటూరు, చింతలపూడి ఇన్‌చార్జిలు తలారి వెంకట్రావు, పుప్పాల వాసుబాబు, కంభంపాటి విజయరాజు, వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, ఏలూరు నియోజకవర్గ కన్వీనర్ మామిళ్లపల్లి జయప్రకాష్, విశాఖపట్నం స్మార్ట్ సిటీ మాజీ చైర్మన్ గన్నమని వెంకటేశ్వరరావు(జీవీ), పార్టీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు నెరుసు చిరంజీవి, ఏలూరు మాజీ డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబు, నగర బీసీ సెల్ అధ్యక్షుడు కిలాడి దుర్గారావు, చేనేత విభాగ మాజీ అధ్యక్షుడు కొల్లిపార సురేష్, గుడివాక మోహన్ తదితరులు రాజబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ పార్టీ కోసం రాజబాబు అహర్నిశలు శ్రమించారని, ఆయన లేని లోటు తీరనిదని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, ఎమ్మార్డీ బలరాం, ఏలూరు ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కంచెన రామకృష్ణ, ఏలూరు డిప్యూటీ మేయర్ పప్పు ఉమ, మాజీ గ్రంథాలయ చైర్మన్ పాకలపాటి గాంధి, మాజీ జెడ్పీటీసీ డీవీఎస్ చౌదరి, నరహరిశెట్టి రాజా, వెల్లంకి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి దివ్య దక్షిణ యాత్ర

ఏలూరు (టూటౌన్): ఐఆర్‌టీసీ ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి 29 వరకు జ్యోతిర్లింగ సహిత దివ్య దక్షిణ యాత్ర పేరుతో రైల్ టూర్ నిర్వహిస్తున్నట్లు విజయవాడ మార్కెటింగ్ మేనేజర్ ఎం.రాజా శనివారం ప్రకటనలో తెలియజేశారు. ఈ యాత్రలో అరుణాచలం – రామేశ్వరం – మధురై – కన్యాకుమారి – త్రివేంద్రమ్ – త్రిచీ – తంజావూరు సందర్శించే అవకాశం ఉంటుందన్నారు. ఈ నెల 21న మధ్యాహ్నం 12 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరే రైలు విజయవాడ, తెనాలి, చీరాల,ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు స్టేషన్‌లలో ఆగుతుందన్నారు. టికెట్ వెల స్లీపర్ క్లాస్ రూ. 14,250. థర్డ్ ఏసీ రూ.21,880, సెకండ్ ఏసీ రూ.28,440గా ఉందన్నారు. వివరాలకు సెల్ నెం.92814 95848లో సంప్రదించాలన్నారు.

తేనెటీగల పెంపకంతో అధిక ఆదాయం



కేవీకేలో తేనెటీగల పెంపకంపై శిక్షణ ఇస్తున్న అధికారులు, శాస్త్రవేత్తలు

ఉండి: తేనెటీగల పెంపకంతో పలు విధాలుగా అధిక ఆదాయం లభిస్తుందని అధికారులు, శాస్త్రవేత్తలు వివరించారు. మండలంలోని ఎన్నార్పీ అగ్రహారం కృషి విజ్ఞాన కేంద్రంలో శాస్త్రీయ పద్ధతిలో తేనెటీగల పెంపకంపై ఏడురోజుల శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా మార్టేరు ప్రాంతీయ పరిశోధనా కేంద్రం సహ సంచాలకుడు డాక్టర్ టీ శ్రీనివాస్, జిల్లా వ్యవసాయాధికారి జడ్ వెంకటేశ్వర్లు, జిల్లా ఉద్యానశాఖ అధికారి ఆర్ దేవానంద్ హాజరై మాట్లాడారు. మానవ జాతి మనుగడకు తేనెటీగలు ఎంతో ఉపయోకరమని అన్నారు. తేనెటీగలు లేకపోతే మొక్కల్లో సంపర్కం జరగక పూత రాలిపోయి కాయలు కాయవని అన్నారు. దీంతో పండు, కూరగాయల ఉత్పత్తి గణణీయంగా పడిపోతుందన్నారు. కాబట్టే ఔత్సాహికులు ఎక్కువ మంది తేనెటీగల పెంపకాన్ని చేపట్టాలన్నారు. కరోనా తరువాత తేనె ఉత్పత్తులకు డిమాండ్ గణనీయంగా పెరిగిందని, తేనెటీగల పెంపకాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తూ రూ.లక్ష వరకు సబ్సిడీ పథకాలు అందిస్తున్నారన్నారు. ఈ రంగంలో ఉన్న అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలని కోరారు. కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ మల్లిఖార్జునరావు మాట్లాడుతూ తేనెటీగల పెంపకం ద్వారా తేనెతో పాటు మైనం, విషం, ప్రోపోలిస్, పుప్పొడి, రాయల్ జెల్లీ వంటి ఉప ఉత్పత్తుల ద్వారా అధిక ఆదాయాన్ని పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో ఏడీఏలు కేఎస్ఎస్ శ్రీనివాస్,, సీహెచ్ శ్రీనివాస్, ప్రకృతి వ్యవసాయం జిల్లా సమన్వయకర్త ఎం అరుణకుమారి, కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్ దెబోరా మెస్సియానా, డాక్టర్ ఏ శ్రీనివాస్, డాక్టర్ ఆర్ బిందుప్రవీణ, డాక్టర్ పీ వినయలక్ష్మి, ఔత్సాహికులు పాల్గొన్నారు.


సివిల్ సర్వీసెస్ యోగా పోటీలకు ఎంపిక



అమ్మాజీని అభినందిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రి నుంచి ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ యోగ చాంపియన్ షిప్ 2024–2025కు ఇరపా అమ్మాజీ ఎంపికైనట్లు జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ బేబీ కమల తెలిపారు. జాతీయ స్థాయి యోగాసన పోటీలు ఈ నెల 5వ తేదీ నుంచి చండీఘర్‌లో నిర్వహిస్తారన్నారు. ఈ పోటీలకు ఆంధ్రప్రదేశ్ నుంచి 32 మంది ఉద్యోగులు ఎంపిక కాగా, వారిలో జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నుంచి చీఫ్ ఫార్మసీ ఆఫీసర్ ఇరపా అమ్మాజీ (అమూల్య) ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మాజీకి జిల్లా అధికారులు, మెడికల్ సూపరింటెండెంట్ డా. సీహెచ్ బేబీ కమలతో పాటు ఆసుపత్రి సిబ్బంది అభినందనలు తెలిపారు.

బలివేలో శివరాత్రి ఉత్సవాల ఆదాయం రూ.40.40 లక్షలు



ఆలయంలో ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

బలివే(ముసునూరు): మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా బలివే రామలింగేశ్వర స్వామి ఆలయానికి రూ.40 లక్షల 40 వేల 674 ఆదాయం లభించినట్లు ఈఓ పామర్తి సీతా రామయ్య తెలిపారు. శుక్ర, శనివారాల్లో ఆలయం వద్ద ఉత్సవాల అధికారి అనూరాధ పర్యవేక్షణలో హుండీలు, ఇతర ఆదాయాల లెక్కింపు నిర్వహించారు. ప్రత్యేక దర్శనాలు, శీఘ్ర దర్శనాలు, తొలి అభిషేకం, ప్రత్యేక అభిషేకాలు తదితర పూజాధికాల ద్వారా రూ.9,54,62, విరాళాల రూపంలో రూ.2,68,098, ఖాళీ స్థలాల్లో తాత్కాలిక దుకాణాల ఏర్పాటు ద్వారా రూ.13,10,000, కొబ్బరి చిప్పల విక్రయం ద్వారా రూ.1,30,000, శాశ్వత, తాత్కాలిక హుండీల ద్వారా రూ.13,77,951 ఆదాయం లభించినట్లు తెలిపారు. గతంతో పోలిస్తే ఈ ఏడాది స్వామి వారికి సుమారు రూ.లక్ష మేర ఆదాయం తగ్గిందన్నారు. కార్యక్రమాల్లో సర్పంచ్ రావు ప్రవీణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమష్టిగా.. సేవే లక్ష్యంగా..

స్ఫూర్తిదాయకంగా ఏబీఎఫ్ కార్యక్రమాలు



నిట్ వద్ద ఏబీఎఫ్ బస్ షెల్టర్ (ఫైల్)



బాధితుల కోసం వస్త్రాల సేకరణ (ఫైల్)

తాడేపల్లిగూడెం: సమాజ సేవే లక్ష్యంగా సాగుతూ పలువురికి ఆదర్శప్రాయంగా నిలుస్తోంది తాడేపల్లిగూడేనికి చెందిన స్వచ్ఛంద సంస్థ ఆత్మబంధువులం సేవా సంఘం (ఏబీఎఫ్). తొలుత ఒక్కరితో మొదలుకాగా అనంతరం 30 మంది వరకు ఈ సంస్థలో చేరి మానవ సేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. పట్టణంలోనే కాకుండా ఇతర ప్రాంతాల్లో సైతం సేవలు అందిస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు.


ఉషస్సు నుంచి ఉద్యమంలా...

తాడేపల్లిగూడేనికి చెందిన ఫొటోగ్రాఫర్ శీతాలం ఉషాకిరణ్ 1999లో నిప్పీ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్‌ను స్థాపించి నేత్ర వైద్య శిబిరం, పశు వైద్య శిబిరాలు, ఉచిత హోమియో వైద్యం అందించేవారు. ఇదే సేవా దృక్పథంతో మరో 29 మంది ఉషాకిరణ్‌కు తోడుకావడంతో కార్యక్రమాలు విస్తృతం చేశారు. కరోనా కాలంలో ఆన్‌లైన్ వైద్య సాయం, నిత్యావసర వస్తువులు అందజేశారు. అనంతరం కరోనా బాధితుల సేవార్థం 30 మందితో 'ఒకరికొకరం.. అందరి కోసం మనం' అనే నినాదంతో 2021లో ఎన్‌జీఓను ప్రారంభించారు. కరోనా బాధితులకు ఆక్సిజన్ ఫ్లో మీటర్లు, పల్స్ ఆక్సీ మీటర్లు అందించడం, విద్యార్థులకు సహాయ కార్యక్రమాలు, దివ్యాంగ పిల్లలకు పుస్తకాలు, స్టడీ మెటీరియల్, ఆట వస్తువులు అందించడం, గ్రేస్ క్యాన్సర్, తానా సౌజన్యంతో కేన్సర్ నిర్ధారణ పరీక్షల శిబిరాల నిర్వహణ, గూడెంలో నిట్ వద్ద బస్ షెల్టర్ నిర్మాణం, ఆరోగ్యం కోసం జిల్లాస్థాయి నడక పోటీలు, హార్ట్ ఎటాక్ వస్తే సత్వర ఉపశమనం కోసం సీపీఆర్ శిక్షణ వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

వరద బాధితులకు అండగా

తెలంగాణ ప్రాజెక్టు పెద్దపల్లి వాగు రెండు గేట్లు కొట్టుకుపోవడంతో వేలేరుపాడు మండలంలో 11 గ్రామాలు కొట్టుకుపోయాయి. వారికి బాసటగా నిలవడానికి ఆ ప్రాంతంలో 20 రోజుల పాటు సహాయ కేంద్రం ఏర్పాటుచేసి సేవలను అందించారు. ప్రజల నుంచి సేకరించిన నిత్యావసరాలు, బియ్యం , సామగ్రిని ఆదివాసీ కుటుంబాలకు అందజేశారు. ఏబీఎఫ్ నిర్వాహకుల్లో ఒకరైన కె.పెదకృష్ణంరాజు సహకారంతో మూడు గ్రామాల్లో బోర్లు వేయించారు. కృష్ణా జిల్లా వరదల్లో మునిగిపోయిన కె.కొత్తపాలెం అనే లంక గ్రామ ప్రజలకు 300 మందికి చీరలు, దుప్పట్లు, నిత్యావసర సామగ్రితో పాటు వైద్య సేవలను అందించారు. వేలేరుపాడు ఫ్లడ్ రిలీఫ్ ఫండ్ కింద లక్ష రూపాయల విరాళం అందజేశారు. ప్రస్తుతం ఈ సంస్థలో 130 మంది సభ్యులుగా ఉండి సేవలు అందిస్తున్నారు.

సమష్టిగా సేవలందిస్తున్నాం



ఏబీఎఫ్ స్వచ్ఛంద సేవా సంస్థను స్థాపించి సమాజానికి సేవ చేయడం సంతృప్తికరంగా ఉంది. సభ్యులు 130 మంది సహకారంతో పెద్దల అండదండలతో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నాం. సేవా కార్యక్రమాలను సమష్టిగా నిర్వహిస్తున్నాం. విద్యార్థులకు, ఆపదలో ఉన్నవారికి అండగా నిలబడేందుకు, వైద్య రంగంపై అవగాహన కల్పించడానికి సంఘం తరపున కృషి చేస్తున్నాం.

– శీతాల ఉషాకిరణ్, ఏబీఎఫ్ వ్యవస్థాపకుడు

క్లుప్తంగా

వరాల వెంకన్నకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో వెంకటేశ్వరస్వామి

అత్తిలి: ఈడూరు గ్రామంలో వరాల వెంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం విశేష పూజలు జరిపారు. వేకువ జామున స్వామివారికి సుప్రభాతసేవ, తోమాలసేవ, ఉదయం అర్చనలు జరిపారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారిని తులసిమాలలు, పలు రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు కాలినడకన హాజరై స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. హాజరైన భక్తులకు దాతల సహకారంతో అన్నదానం చేశారు.

కారుమూరి పరామర్శలు


తణుకులో కలిశెట్టి సురేష్‌తో మాట్లాడుతున్న మాజీమంత్రి కారుమూరి

తణుకు అర్బన్: పట్టణంలోని తణుకు స్వామి జ్యూయలర్స్ అధినేత కలిశెట్టి సురేష్‌ను మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు శనివారం పరామర్శించారు. సురేష్ నివాసానికి వెళ్లిన కారుమూరి ఆయన ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ సభ్యుడు వెలగల సాయిబాబారెడ్డి, బల్లిపాడు సర్పంచ్ కేశిరెడ్డి బాలాజీ, మారిశెట్టి శేషగిరి, వై.రామకృష్ణ, షేక్ జిలానీ ఉన్నారు.

అందరూ సమన్వయంతో పనిచేయాలి


నీలాద్రిపురం గ్రామంలో నాయకులను కలిసి కమిటీలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ముప్పిడి సంపత్‌కుమార్ అన్నారు. మండలంలోని నీలాద్రిపురం, కడియద్ద, కొమ్ముగూడెం, పట్టింపాలెం, వీరంపాలెం తదితర గ్రామాల్లో ఆయన పర్యటించి గ్రామ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంపత్‌కుమార్ మాట్లాడుతూ నిత్యం ప్రజల్లో ఉంటూ వారి సమస్యలపై పనిచేయాలన్నారు. అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు అండగా ప్రతీ కార్యకర్త ఉండాలన్నారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జడ్డు హరిబాబు, నియోజకవర్గ సోషల్‌మీడియా కన్వీనర్ కనుపూరి ఉదయభాస్కర్, మండల కమిటీ తమ్మిశెట్టి రఘు, వెలిశెట్టి నరేంద్రకుమార్, రూరల్ మండల మహిళా అధ్యక్షురాలు నూనె రాధాకుమారి పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం


దర్శిపర్రు జెడ్పీస్కూల్లో మహిళా దినోత్సవ అవగాహన సైకిల్ ర్యాలీ

పెంటపాడు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని సర్పంచ్ కోలా శేషవేణి తెలిపారు. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా దర్శిపర్రు గ్రామంలో అంగన్‌వాడీల ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ శేషవేణి ప్రారంభించారు. ఈ సందర్భంగా శేషవేణి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. చిన్నారుల పోషణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీస్కూల్ విద్యార్థినులు, కిశోర్ బాలికలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు వద్దు..చదువే ముద్దు

తాడేపల్లిగూడెం (టీఓసీ): అంతర్జాతీయ మహిళా వారోత్సవాలలో భాగంగా శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో స్థానిక కోడే వెంకట్రావు మునిసిపల్ ఉన్నత పాఠశాలలోని మహిళా హక్కులపై అవగాహన సమావేశం నిర్వహించారు. బాల్య వివాహాలు వద్దు, చదువే ముద్దు అంటూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పి.సునీత, కేఎస్.సత్యనారాయణ, డి.సూర్య శ్రీనివాస్, సూపర్‌వైజర్లు కె.విశాలాక్షి, ఎం.సుజాత, మహిళా సంరక్షణ కార్యదర్శి కె.కల్పన, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తకు పరామర్శ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని జగ్గన్నపేట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కాసాని శ్రీను ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఆయన్ని వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డి రఘురాం నాయుడు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా రూ.15 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

సూపర్ సిక్స్ హామీలకు ‘చిల్లు’

- హామీలు అమలు చేయడంలో చిత్తశుద్ధి లేదా..
- విద్యార్థి సంఘాల ఆగ్రహం


తణుకులో నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు

తణుకు అర్బన్: కూటమి ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేటాయింపులు, కోతలకు సంబంధించి ప్రజానీకంతోపాటు విద్యార్థి సంఘాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ముఖ్యంగా విద్యార్థులు, నిరుద్యోగుల పట్ల ఈ బడ్జెట్ కేటాయింపులు అత్యంత దారుణమంటూ పలు నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. చదివిన చదువులకు ఉద్యోగాలు లేక ఇబ్బందులు పడుతున్న నిరుద్యోగులకు ఎన్నికల హామీల్లో భాగంగా ఇస్తానన్న రూ. 3వేలు నిరుద్యోగ భృతి ఊసేలేదని, యువతకు మొండి చేయి చూపారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉద్యోగాల కల్పనలో ప్రతి ఏడాది జనవరి నెలలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పినా ఇంతవరకు అమలు కాలేదని ధ్వజమెత్తుతున్నారు. తల్లికి వందనం అమలు జరిగే విధానం కూడా అయోమయంలో ఉందని, ఇంట్లో ఎంతమంది చదువుకుంటే అందరికీ రూ. 15వేలు ఇస్తామన్న హామీ కూడా కోతలు విధించేలా బడ్జెట్ నిధులు కేటాయింపులు జరిగాయని ఆరోపిస్తున్నారు. బడ్జెట్‌లో విద్యార్థులు, యువతకు మొండిచేయి చూపడంతో తణుకులో పలు విద్యార్థి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిరసనలు తెలుపుతున్నాయి.

తల్లికి వందనం కేటాయింపుల్లో కోత



ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకుంటే అంత మందికి తల్లికి వందనం ఇస్తానన్న కూటమి నేతలు ఇప్పుడు తాజాగా ప్రకటించిన బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు చూస్తుంటే కోతలు తప్పవని తెలుస్తోంది. ఇవ్వలేని హామీ లు గుప్పించి ప్రజలను మోసం చేయడంలో కూటమి ప్రభుత్వం ఆరితేరింది.

– జి.ఎడ్వర్డ్ పాల్, వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం నాయకులు, తణుకు

నిరుద్యోగ భృతి రూ. 3 వేలకు బడ్జెట్ ఏదీ



ఎన్నికల హామీలో భాగంగా కూటమి నేతలు ఇచ్చిన హామీలో భాగంగా నిరుద్యోగ భృతి కోసం నిరుద్యోగులు నెలకు రూ. 3వేలు కోసం ఎదురుచూపులు చూస్తున్నారు. అంతేకాకుండా ఉద్యోగాలు కల్పిస్తామని, ప్రతి ఏటా జనవరి నెలలో జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఉద్యోగాల విప్లవాన్ని తీసుకువస్తానని బడ్జెట్‌లో ఆ ఊసే లేకుండా పోయింది.

– టి. అప్పలస్వామి, ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

తణుకు అర్బన్: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ తణుకు నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి శనివారం ప్రకటన విడుదల చేశారు. యూత్ వింగ్ అధ్యక్షుడిగా కొత్తపల్లి చరణ్ కుమార్, మహిళా విభాగం అధ్యక్షుడిగా మెహర్ ఉన్నీసా బేగం, రైతు విభాగం అధ్యక్షుడిగా సత్తి వెంకటరెడ్డి, బీసీసెల్ అధ్యక్షుడిగా మామిడిశెట్టి శ్రీనివాసరావు, ఎస్సీసెల్ అధ్యక్షుడిగా సబ్బితి రాజేష్, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా కామాక్షి రవి, మైనారిటీసెల్ అధ్యక్షుడిగా షేక్ అబ్దుల్ ఖాదర్ జిలానీ, క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా యాళ్ల సాధు సుందర్‌సింగ్, స్టూడెంట్ వింగ్ అధ్యక్షుడిగా గోపే ఎడ్వర్డ్ పాల్, పంచాయితీరాజ్ వింగ్ అధ్యక్షుడిగా మంగెన వెంకట రామనాయుడు, మునిసిపల్ వింగ్ అధ్యక్షుడిగా యిండగపల్లి బలరామకృష్ణ, ఆర్టీఐ వింగ్ అధ్యక్షుడిగా బిరుదుకోట చింతన్న, వలంటీర్స్ వింగ్ అధ్యక్షుడిగా దాసి రత్నరాజు, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడిగా యడ్లపల్లి సురేంద్ర, వాణిజ్య విభాగ అధ్యక్షుడిగా రానిరెడ్డి రాజేంద్రప్రసాద్, వీవర్స్ వింగ్ అధ్యక్షుడిగా పట్టాబత్తుల వీర వెంకట నాగ సాయి మల్లి వరప్రసాద్, వైఎస్సార్ టీయూసీ అధ్యక్షుడిగా కట్టా అప్పనపల్లి, అంగన్‌వాడీ వింగ్ అధ్యక్షుడిగా బెజ్జవరపు హేమశ్రీ, లీగల్ సెల్ అధ్యక్షుడిగా బలిజేపల్లి ఫణి రవిశంకర్, కల్చరల్ వింగ్ అధ్యక్షుడిగా ముద్దాల రవికాంత్, సోషల్ మీడియా వింగ్ అధ్యక్షుడిగా చింతలపూడి సూర్యనారాయణ, ఐటీ వింగ్ అధ్యక్షుడిగా రేలంగి తారక వెంకట రామారావు, దివ్యాంగుల విభాగ అధ్యక్షుడిగా నామాల వెంకట అయ్యప్ప స్వామి, డాక్టర్స్ వింగ్ అధ్యక్షుడిగా కె.ఆనంద్, ఇంటెలెక్చువల్స్ ఫోరమ్ అధ్యక్షుడిగా కరుటూరి సత్య పాండురంగారావు, బూత్ కమిటీ వింగ్ అధ్యక్షుడిగా వడ్లూరి సాయి సీతారామకృష్ణ, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడిగా వీరమల్లు ఫణీంద్రకుమార్‌లు నియమితులయ్యారు.

కృష్ణాయపాలెంలో ర్యాలీ


విద్యార్థులకు అవగాహన కార్యక్రమం దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని కృష్ణాయపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ కే.శ్రీదేవి బాలికల విద్య, వివాహ వయస్సు తదితర అంశాలను వివరించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రమీల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రశాంతం


శ్రీవాసవి వద్ద ఇంటర్ విద్యార్థులు


తణుకులో పరీక్ష రాసేందుకు వెళ్తున్న విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): నియోజకవర్గంలో తాడేపల్లిగూడెం టౌన్, పెంటపాడులలో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. నియోజకవర్గంలోని 6 సెంటర్‌లలో టౌన్‌లోని శ్రీ వాసవి, ఆదిత్య, జీఎంఆర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, డీఆర్ గోయెంకా ఉమెన్స్ జూనియర్ కళాశాలలోను, అదే విధంగా పెంటపాడు జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం పరీక్షలు నిర్వహించారు. తెలుగు, హిందీ, సంస్కృతం, ఒకేషనల్ పరీక్షలు జరిగాయి. ఉదయం 7.30 గంటల నుంచి ఇంటర్ విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరిగింది. 2400 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 2340 మంది పరీక్షలకు హాజరైనట్లు తెలిపారు. 60 మంది పరీక్షలు రాయలేదు. ఛీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంటల్ ఆఫీసర్‌లు పర్యవేక్షించారు.

ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

తణుకు అర్బన్: ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు శనివారం ప్రారంభం అయ్యాయి. మొదటి రోజైన శనివారం జరిగిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 9 గంటలకు పరీక్షా కేంద్రాలకు హాజరుకావాలని ఆలస్యం అయితే కేంద్రంలోనికి అనుమతించబోమని విద్యాశాఖాధికారులు ముందుగానే ప్రకటించడంతో అరగంట ముందుగానే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. కేంద్రాల వద్ద తమ హాల్‌టికెట్ నంబర్లను సరిచూసుకుని విద్యార్థులు లోపలకు వెళ్లారు. తణుకు పట్టణంలో 8 పరీక్షా కేంద్రాల్లో 3465 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా, 3342 మంది విద్యార్థులు హాజరైనట్లు అధికారులు చెప్పారు. 123 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారని, ఇందులో జనరల్ విద్యార్థులు 2,888 మంది, ఒకేషనల్ విద్యార్థులు 454 మంది ఉన్నారని వివరించారు.

ఆందోళనలు ఉధృతం చేస్తాం


సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్

తాడేపల్లిగూడెం రూరల్: వెల్ఫేర్ బోర్డు పునరుద్ధరణకు అవసరమైతే రాబోయే రోజుల్లో ఆందోళనలు ఉధృతం చేస్తామని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ హెచ్చరించారు. శనివారం మండలంలోని మాధవరం గ్రామంలో గోదావరి భవన నిర్మాణకార్మిక సంఘ సర్వసభ్య సమావేశం గంధం సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సోమసుందర్ మాట్లాడుతూ బోర్డు పునరుద్ధరణ చేస్తామంటూ ఎన్నికల్లో కూటమి నేతలు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పోలిరాతి ఆదినారాయణ, ఏరియా తాపీ, వడ్రంగి, సెంటరింగ్, రాడ్ బెండింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు దువ్వా శ్రీను మాట్లాడుతూ ఎన్నికల ముందు కార్మికుల సమస్యలను చంద్రబాబు, పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకురాగా, తమ ప్రభుత్వం రాగానే కార్మిక సమస్యలు పరిష్కరిస్తామని హామీనిచ్చారని గుర్తు చేశారు. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస ద్వారా కార్మిక శాఖ మంత్రికి విన్నవించామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. యూనియన్ జిల్లా కార్యవర్గ సభ్యుడు కోడె సాయిబాలాజీ, గోదావరి గ్రామీణ భవన నిర్మాణ కార్మిక సంఘ కార్యదర్శి తాతకుంట శ్రీనివాస్, కోశాధికారి కంకిపాటి రాజు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి శ్రేణులంతా కష్టపడాలి

- కాఫీ విత్ కారుమూరి
- తణుకులో పార్టీ శ్రేణుల్లో సందడి


తణుకులో పార్టీ శ్రేణులతో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

తణుకు అర్బన్: ఇచ్చిన మాట నిలబెట్టుకునే నాయకుడు, రాజకీయాల్లో ఒంటరిగా ప్రత్యర్థిని ఢీకొట్టే ధైర్యమున్న వ్యక్తి మన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. కాఫీ విత్ కారుమూరి కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ సీపీ ప్రచారకమిటీ తణుకు నియోజకవర్గ అధ్యక్షుడు ఫణీంద్రకుమార్ వీరమల్లు నివాసంలో శనివారం పార్టీ శ్రేణులతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం శ్రమించే ప్రతి ఒక్కరిని గుర్తు పెట్టుకుంటామని అన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా కక్షపూరితంగా వైఎస్సార్ సీపీ నేతలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, అందరినీ గుర్తుపెట్టుకోమని ఇప్పటికే జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ నేతలకు ఆదేశాలిచ్చారని వడ్డీతో సహా చెల్లించే రోజులు వస్తాయని అన్నారు. తణుకు నియోజకవర్గ పరిధిలో పార్టీ బలోపేతానికి పార్టీ శ్రేణులంతా కష్టపడాలని, భవిష్యత్తులో మీకందరికి పార్టీ అండగా నిలబడుతుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఫణీంద్రకుమార్ నివాసంలో అల్పాహారం అనంతరం పార్టీ శ్రేణులంతా కాఫీ సేవించారు. వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ సభ్యుడు వెలగల సాయిబాబారెడ్డి, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు పొట్ల సురేష్, వైఎస్సార్ సీపీ జిల్లా సెక్రటరీ ఆర్గనైజింగ్ యిండుగపల్లి బలరామకృష్ణ, పబ్లిసిటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు జల్లూరి జగదీష్, తణుకు నియోజకవర్గ మహిళాధ్యక్షురాలు మెహర్ అన్సారీ, తేతలి గ్రామ మాజీ సర్పంచ్ కోట నాగేశ్వరరావు, ఇరగవరం మండల అధ్యక్షులు కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, మైనం పాము, మమత యాదవ్, కోట స్వామీజీ, వై.రామకృష్ణ, షేక్ జిలానీ, వీరమల్లు గణపతి, కాసాని సత్యనారాయణ, వీరమల్లు శివ పాల్గొన్నారు.

తణుకు మండల అధ్యక్షుడిగా పెనుమర్తి వెంకటరామన్న

తణుకు అర్బన్: వైఎస్సార్‌సీపీ తణుకు మండల అధ్యక్షుడిగా వేల్పూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ మాజీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకటరామన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వెంకటరామన్న నిరాడంబరుడిగాను, సౌమ్యుడిగా పేరొందిన వ్యక్తి అని అధ్యక్షుడిగా అందరి అభిప్రాయం మేరకు ఆయనను నియమించారని వివరించారు. సహకార సంఘ అధ్యక్షుడిగా సంస్థను అభివృద్ధి పథంలో నడిపి అందరి మన్ననలు పొందారని గుర్తు చేశారు. అధ్యక్షుడిగా నియమితులైన వెంకటరామన్నకు పార్టీ శ్రేణులంతా సహకరించాలన్నారు. ఈ సందర్భంగా వెంకటరామన్న మాట్లాడుతూ తనపై నమ్మకముంచి తనకు ఈ బాధ్యతలు అప్పగించిన మాజీమంత్రి కారుమూరి నమ్మకాన్ని నిలబెడతానని, తణుకు మండలంలో పార్టీ అభివృద్ధికి తోడ్పడతానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రుద్రా ధనరాజు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఉండవల్లి జానకి, వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ తణుకు మండల అధ్యక్షుడు జంగం ఆనంద్‌కుమార్, తేతలి గ్రామ మాజీ సర్పంచ్ కోట నాగేశ్వరరావు, ఎంపీటీసీ చంద్రు శ్యామల రత్నకుమారి, కరిబండి రాజేష్, ముళ్లపూడి బాబూరావు, భూపతిరాజు రామకృష్ణంరాజు, నున్న దుర్గాప్రసాద్, ఎంజేటి విజయలక్ష్మి, కోట స్వామీజీ, పాలా శ్రీను, కొమ్ముగంటి నాగు, మల్లిపూడి పెద పోచయ్య, మల్లిపూడి త్రినాథ్ పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎస్సీ వర్గీకరణ కోసం అసువులు బాసిన మాదిగ అమరవీరుల ప్రాణ త్యాగాలు మరవలేనివని మహాజన సోషలిస్ట్ పార్టీ (ఎంఎస్‌పీ) జిల్లా ప్రచార కార్యదర్శి దూలపలి శ్రీనివాస్ పేర్కొన్నారు. మాదిగల అమరవీరుల సంస్మరణ సభ శనివారం స్థానిక తాలూకా సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద మాదిగ యువసేన జిల్లా అధ్యక్షులు గాలింకి ప్రేమ్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు చెప్పుల వాసు, టి.జోసెఫ్, తెన్నేటి జగజీవన్, జే.సురేష్ బాబు, లంక రాజశేఖర్, కండెల్లి సీతారామరాజు, పాతకాకుల నాగరాజు, ఒలేటి ఆనంద్ పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టల్ పనులు త్వరగా పూర్తి చేయాలి


పరిమెళ్ల సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

పెంటపాడు: మండలంలోని పరిమెళ్ల సాంఘిక సంక్షేమ వసతి గృహ మరమ్మతులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ పరిమెళ్లలోని సాంఘిక సంక్షేమ వసతిగృహాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న మరుగుదొడ్లు, స్లాబ్ లీకేజీ పనులు పరిశీలించారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా మరమ్మతు పనులను వేగవంతం చేయాలని ఆమె కోరారు. వసతి తరగతి గదులను పరిశీలించారు. భీమవరం, నర్సాపురం డివిజన్ ఈఈలు బడుగు వెంకటరమణ, ఎం. శ్రీనివాస్, డీఈ పిచ్చయ్య, గూడెం డీఈ వెంకట్రావు, ఎంపీడీవో బాలాజీ, హౌసింగ్ అధికారులు జయరాజు, ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి బాలాజీ, వీఆర్వో పద్మ, తదితరులు పాల్గొన్నారు. అలాగే పరిమెళ్ల జెడ్పీ స్కూల్లో పదోతరగతి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు.

అంగన్‌వాడీల్లో.. ‘జ్ఞానజ్యోతి’ వెలుగులు!

- మారనున్న చదువులు
- కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ తరగతులు



అత్తిలిలో అంగన్‌వాడీ కార్యకర్తల శిక్షణలో మాట్లాడుతున్న సీడీపీఓ ప్రమోదకుమారి(ఫైల్)

అత్తిలి: జాతీయ విద్యావిధానం అమలులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువులు కొత్తరూపు సంతరించుకోబోతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలు ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా మారబోతున్నాయి. మూడు నుంచి ఐదేళ్ల మధ్య వయసు గల చిన్నారులకు ఆట పాటలతో కూడిన చదువులు అందించేలా జ్ఞానజ్యోతి పేరిట ప్రత్యేక కార్యక్రమానికి అధికారులు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా శిక్షణ పొందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు చిన్నారులకు మెరుగైన విద్యాబోధన చేయడానికి అంగన్‌వాడీ కార్యకర్తలకు మొదటి, రెండవ విడతల్లో ఆరు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను ప్రాథమిక పాఠశాలలకు అనుసంధానం చేసి ఒకటి, రెండు తరగతులు బోధించే విధంగా పిల్లల మానసిక, అభ్యసనా స్థాయిలపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించాలన్నదే శిక్షణ కార్యక్రమం లక్ష్యం.

ఆటపాటలతో శిక్షణ తరగతులు..

పూర్వ ప్రాథమిక పాఠశాలల్లో పిల్లలు అనేక కృత్యాల ద్వారా భవిష్యత్తులో వారు చదవబోయే విద్యకు సంబంధించిన బలమైన పునాదులు ఇక్కడే నిర్మించుకుంటారు. వారు చదవడం, రాయడం ఇతరులతో సంభాషించడం, భాషను అభివృద్ధి చేసుకుంటూ భావోద్వేగాలను అదుపు చేసుకొని తోటి బాలలతో కలిసి మెలసి ఉండడాన్ని నేర్చుకుంటారు. ఈ విద్యావిధాన పునర్నిర్మాణంలో పునాది దిశగా పేర్కొంటూ అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇస్తోంది. ఇందులో బాగంగా ఊహాత్మక అనుకరణ, వివిధ రకాల ఆటలు, దుస్తులు ధరించడం, ప్రకృతి సందర్శన, నటన, ప్రకృతి, శాస్త్రీయజ్ఞానం, గణిత సంబంధిత ఆటలు, పజిల్స్, అక్షరాలు, సంఖ్యలను చిన్నారులు గుర్తు పట్టే విధంగా బోధన చేసేలా కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా అంగన్‌వాడీ కార్యకర్తలతో పాటు తల్లిదండ్రులు, సమాన సభ్యుల ప్రమేయంతో పిల్లల అభ్యసన, ఎదుగుదల, అభివృద్ధిలో భాగస్వాములుగా చేసే విధంగా శిక్షణ ఇస్తున్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలో బోధన నైపుణ్యతను పెంపొందించడమే లక్ష్యంగా సర్టిఫికెట్ కోర్సులో భాగంగా 120రోజుల పాటు శిక్షణ ఇస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పునాది..

పిల్లల అభివృద్ధికి మొదటి ఆరేళ్ల వయస్సు చాలా కీలకం, దీనిని దృష్టిలో ఉంచుకుని మానసిక నిపుణుల సూచనల మేరకు ఎన్ఈపీలో ఈవయస్సు వారికి ప్రాధాన్యమిచ్చారు. 0 నుండి 6 సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లల కోసం ప్రత్యేకంగా నిర్వహించే అంగన్‌వాడీ కేంద్రాలే వారి భవిష్యత్‌కు దిక్సూచిగా నిలవాలనే లక్ష్యంతో వైఎస్సార్‌సీపీ హయాంలోనే బలమైన పునాదులు వేశారు. మన బడి నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా మౌలిక వసతులు పెపొందించడంతో పాటు ప్రతి కేంద్రానికి ఆట వస్తువులు కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించారు.

మూడేళ్ల సర్టిఫికెట్ కోర్సు

అంగన్‌వాడీలకు మూడేళ్ల సర్టిఫికెట్ కోర్సు అందిస్తారు. ఈవ్యవధిలో ఏడాదికి 40 రోజుల చొప్పున మొత్తం 120 రోజుల శిక్షణ అందిస్తారు. తొలిదశలో 20 రోజులు, మలిదశలో 20 రోజుల చొప్పున కొనసాగుతున్న ఈశిక్షణను హైబ్రిడ్ విధానంలో నిర్వహిస్తారు. ఆరు రోజుల పాటు ఆఫ్‌లైన్, 14 రోజుల పాటు ఆన్‌లైన్ విధానంలో శిక్షణ ఇస్తారు.

మెరుగైన ఫలితాల కోసం



జాతీయ విద్యావిధానానికి అనుగుణంగా ప్రీ ప్రైమరీ స్కూళ్లపై ఫోకస్ పెట్టడం జరిగింది. ఫైండేషన్ లిటరసీ, న్యూమరసీ ప్రొగ్రాంలో భాగంగా ఇప్పటికే శిక్షణ పొందిన ఉపాధ్యాయులు అంగన్‌వాడీ కార్యకర్తలకు 120రోజుల సర్టిఫికెట్ కోర్సులో భాగంగా శిక్షణ ఇవ్వడం జరుగుతోంది. శిక్షణ ద్వారా మెరుగైన ఫలితాలు వచ్చేలా ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం.

– పి ప్రమోదకుమారి, సీడీపీఓ, తణుకు ప్రాజెక్టు

సులభతర బోధనకు శిక్షణ దోహదం



జ్ఞానజ్యోతి కార్యక్రమం ద్వారా ప్రస్తుతం మాకు ఇస్తున్న శిక్షణ చిన్నారులకు సులభతర బోధనకు ఎంతో ఉపయోగపడుతోంది. శారీరక మేధ, సమాజిక, భావోద్వేగ, భాష, అక్షరాస్యత, సౌందర్య, సాంస్కృతిక వికాసంపై శిక్షణ పొందుతున్నాం.

– ఎం శ్రీదేవి, సూపర్‌వైజర్, తిరుపతిపురం సెక్టార్

పక్కాగా తరగతులు



ప్రీ ప్రైమరీ స్కూళ్లపై దృష్టి సారించాం. వివిధ కార్యక్రమాలలో భాగంగా ఇప్పటికే 1,2 తరగతులు బోధించే ఉపాధ్యాయులకు శిక్షణ పొందారు. ఇప్పుడు అంగన్‌వాడీ కార్యకర్తలకు సర్టిఫికెట్ కోర్సులో భాగంగా శిక్షణ ఇస్తున్నాం. ఇందులో మెరుగైన ఫలితాలు వచ్చేలా ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం.

– ఎస్ రమేష్, ఎంఈఓ, అత్తిలి

7, 8 తేదీల్లో అలంపురానికి ప్రత్యేక వైద్యుల రాక

పెంటపాడు: మండలంలోని అలంపురం వెంకటరమణ ట్రస్టు ఆసుపత్రికి ఈనెల 7,8 తేదీల్లో హైదరాబాద్‌కు చెందిన ప్రత్యేక వైద్యులు డాక్టర్ రాజశేఖర్ రానున్నట్లు ట్రస్టు ప్రతినిధి కృష్ణంరాజు ఒక ప్రకటనలో తెలిపారు. షుగర్‌కి సంబంధించి మానని పుండ్లు, పాదాల వంకర, గాంగ్రీన్ (కుళ్లిపోవుట) తదితర వ్యాధులను పరీక్షించి అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేసి, అతితక్కువ రేటుకు పాదరక్షల ఏర్పాటు ట్రస్టు ఆసుపత్రి ద్వారా చేయనున్నట్లు ఆయన తెలిపారు. పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కృష్ణంరాజు కోరారు.